
ఓ౩మ్

అపశూద్రాధికరణము

(శ్రీ శంకరాచార్యులు)



పండిత గోపదేవ్

ఓమ్

వేదాంత దర్శనము-అపశూద్రాధికరణము

శ్రీ శంకరాచార్యులు

భారతీయ దర్శనములలో వేదాంత దర్శన మొకటి. దానిని ఉత్తర మీమాంస యనియు, బ్రహ్మసూత్రములనియు నందురు. ఇయ్యది వ్యాస ముని ప్రణీతము. గ్రంథము సూత్ర రచనలో నున్నది. సాంప్రదాయకులచే చెప్పబడు ప్రస్థానత్రయములో నియ్యది యొకటి. దక్షిణదేశపు సంప్రదాయ విదులు గీత, ఉపనిషత్తులు, బ్రహ్మసూత్రములు నను మూడు గ్రంథములను ప్రస్థానత్రయ మందురు. అద్వైతాది సంప్రదాయ ప్రవర్తకులయిన శ్రీమచ్ఛంకర భగవత్పాదులు మున్నగు నాచార్యులీ మూడు గ్రంథములకును భాష్యములు రచించి యున్నారు. ఆ యా సంప్రదాయములకు చెందిన శిష్ట పురుషు లెల్లరు నీ గ్రంథములపై నాచార్యులచే రచియింపబడిన భాష్యములను జదువని వారికి అనగా ప్రస్థానత్రయమును జదువనివారికి మోక్షప్రాప్తి లేదనియే యెంచుచున్నారు. దీనిం బట్టి మోక్షాపేక్ష గలవారికి ప్రస్థానత్రయమని పిలువబడు నీ గ్రంథములు జదువుట యెంత ముఖ్యమో పాఠకు లూహింప గలరు. అందునను బ్రహ్మసూత్రములు, వానిపై నాచార్యులచే వ్రాయబడిన యాచార్యుల భాష్యములును మిక్కిలి ముఖ్యములు. బ్రహ్మసూత్రములపై వ్రాయబడిన భాష్యములలో శారీరకభాష్య మత్యంతము ప్రసిద్ధము. అయ్యది శ్రీ శంకరస్వాములచే వ్రాయబడినది. వారికి తరువాత శ్రీ రామానుజస్వాములు మున్నగువారును శంకరస్వాములు వ్రాసినట్లే భాష్యములను బ్రహ్మసూత్రములకు వ్రాసియున్నారు. కాని శ్రీ శంకరుల భాష్యము తక్కిన భాష్యములకు మార్గదర్శకముగా కనబడును.

శ్రీ శంకరులు వేదాంతదర్శనములోని ప్రథమాధ్యాయ తృతీయ పాదమునకు చెందిన 34, 35, 36, 37, 38 సంఖ్యగల యైదు

సూత్రములను ఒక యధికరణముగా విభజించి "అపశూద్రాధికరణము" అని పేరిడి యున్నారు. ఈ యైదు సూత్రములకు భాష్యమును రచియించి, యందు శూద్రులకు శాస్త్రముంజదువు నధికారములేదని సిద్ధాంతముచేసియున్నారు. ప్రస్తుత మీ లేఖయందు శ్రీ శంకరస్వాములచే జేయబడిన యా సిద్ధాంతములోగల యౌచిత్యమునుగూర్చి విచారింపబడును. పాఠకులు పరిశీలింతురుగాక!

ముందుగా అపశూద్రాధికరణమని పిలువబడు నాయైదు సూత్రముల నిట పొందు పఱచుచున్నాడ.

(1) "శుగస్య తదనాదర శ్రవణాత్ తదాద్రవణాత్ సూచ్యతే హి"1.3-34

అర్థము : ఆ యనాదర శ్రవణమువలన, దానిచే బరువిడినందునను నతని శోకము సూచింపబడుచున్నది.

(2) "క్షత్రియత్వావగతేశ్చోత్తరత్ర చైత్రరథేవ లింగాత్" 1. 3-35

అర్థము : మఱియొకచోనున్న చైత్రరథ లింగమువలన, క్షత్రియత్వము ప్రాప్తించినందునను.

(3) "సంస్కారపరామర్శాత్ తదభావాభిలాపాచ్చ" 1. 3-37

అర్థము : సంస్కారమును పరామర్శించుట వలనను, దాని యభావము చెప్పబడుటవలనను.

(4) "తదభావనిర్ధారణే చ ప్రవృత్తేః" 1. 3-3

అర్థము : దాని యభావము నిర్ధారణముకాగా ప్రవృత్తి కలిగినందునను.

(5) "శ్రవణాధ్యయనార్థ ప్రతిషేధాత్ స్మృతేశ్చ" 1. 3-38

అర్థము : శ్రవణము, అధ్యయనము, అర్థము నిషేధించుటవలన, స్మృతియందు చెప్పబడినందువలనను.

పై పంక్తులలో సూత్రములు, సూత్రములలోని శబ్దార్థములు పాఠకులు జదువగలరు. ఈయైదు సూత్రములకు శ్రీ శంకరులు అపశూద్రాధికరణము అని పేరుపెట్టియున్నారు. బుద్ధిమంతులకు శంకరస్వాములు

చేసిన నామకరణములలోనే శూద్రులను ఏదోయొక విషయమునుండి తొలగింప నెంచినట్లు పొడకట్టకపోదు. ఈ సూత్రముల కిట్టి పేరు పెట్టి, వాని నన్వయించుచు శూద్రులకు వేదశాస్త్రములు జదువ నధికారము లేదని ఆచార్యులు నిర్ణయించియున్నారు. ఇట్టి నిర్ణయములే వేదవిధులుగా నంగీకరించి యాచార్యులచే నడపబడిన సంప్రదాయముల ననుసరించు నేటి విద్వాంసులు, అవిద్వాంసులు నయిన బ్రాహ్మణబ్రువు లెల్లరు శూద్రులకు వేదములను వినుటకుగాని, ఉచ్చరించుటకుగాని, వేదనామక గ్రంథములను స్పృశించుటకుగాని అధికారము లేదని నుడువుచున్నారు. అబ్రాహ్మణుల యిండ్లలో జరుగు గృహ్యసంస్కారములను కూడ నవైదికముగ నపభ్రంశముగ జరుపుచున్నారు. శూద్రులకు విద్యాదానము చేయుటకును వెనుకాడుచున్నారు. భారతమున నిట్లు అవిద్యావ్యాప్తికి వీరు కారకులగుచున్నారనుట యనుచితము కాదు.

వాస్తవమున నుపర్యుక్త సూత్రములను బరికించిన నందు శూద్ర పదముకాని, అయ్యది జాతి శూద్రులకు బోధకమనికాని, అట్టి జాతి శూద్రులకు వేదశాస్త్రములు చదువరాదని చెప్పుటకు తగిన యాధారములుకాని యెక్కడను మచ్చునకైనను నగపడవు. అయినను బలవంతముగ నిట ప్రసక్తికలిగించి శూద్రులకు వేదశాస్త్రములు వినుటకును, చదువుటకును, తదర్థముల నాచరించుటకును అర్హత - అధికారము లేదని శ్రీశంకరస్వాములు నిర్ణయించియున్నారు. ఈ నిర్ణయము మిక్కిలి యనుచితము, పక్షపాతపూర్ణము, రాగద్వేషాది ప్రయుక్తము నని తెలుపుటకే నే నీ పంక్తులనిట వ్రాయుచున్నాడ. విజ్ఞు లిందలి గుణదోషములను గుర్తింతురు గాక!

ఈ యపశూద్రాధికరణరచనకు పూర్వ మీ యధ్యాయము నందే (హృద్యపేక్షయా తు మనుష్యాధికారత్వాత్, 1-3-25) అను సూత్ర భాష్యమునందు, (శాస్త్రం హి అవిశేషప్రవృత్తమపి మనుష్యానేవాధికరోతి) 'శాస్త్రము విశేషించి యొకరికని ప్రవృత్తముకాకున్నను మనుష్యాధికారకమే' యని శంకరాచార్యులు వ్యాఖ్యానించి యున్నారు. సూత్రమునందును 'మనుష్యాధికారత్వాత్' అను పదము స్పష్టముగా కనబడుచునేయున్నది. అందువలన శంకరస్వాము లిట్లు వ్రాయుటయు

నుచితమే. ఇట శాస్త్రమనగా వేదశాస్త్రము లనియే శంకరుల యభిప్రాయ మనియు పాఠకులు గుర్తింతురుగాక! (కారణ మేమన:- ఆచార్యులు శాస్త్ర యోనిత్వాత్ 1-1-3) అను సూత్రభాష్యమునందు ('మహత, ఋగ్వేదాదేః శాస్త్రస్య అనేక విద్యాస్థానోపబృంహితస్య ప్రదీపవత్ సర్వార్థావద్యోతినః, సర్వజ్ఞకల్పస్య యోనిః కారణం బ్రహ్మ' శాం.భా.) 'గొప్పది యగు ఋగ్వేదాదిశాస్త్రము అనేక విద్యాస్థానోపబృంహితము, ప్రదీపము వలె సర్వార్థములను ప్రకాశింపజేయునది, సర్వజ్ఞుడగు పరమేశ్వరునితో తుల్యము' నని యిట శాస్త్రపదముచే వేదములనే గ్రహించియున్నారు. అట్టి వేదములకు కర్తయు పరబ్రహ్మ పరమేశ్వరుడనియే యాచార్యు లంగీకరించుచున్నారు. అందువలననే (శాస్త్రస్య యో యోనిః కారణం బ్రహ్మ) 'శాస్త్రమునకు యోని - ఉత్పత్తిస్థానము, కారణం - నిమిత్త కారణము బ్రహ్మమనియు స్వయముగా నుడివియున్నారు. ఇట్లు వేద శాస్త్రము లీశ్వరీయములు కాబట్టి యవి ప్రాణిమాత్రము నుద్దేశించి ప్రవృత్తములగుట యుక్తిసంగతమే. విశేషించి యెవరికో యొకరికి, లేక కొందఱకు మాత్రమే యనిచెప్ప వలనుపడదు. అందువలన నెల్లరకు నవిశేషములే - సమానములే. ప్రాణులలో వ్యక్తవాక్కులగు మానవుల కందఱకు నా శాస్త్రములం దధికార మున్నదని శంకరాచార్యులు భాషించుట మిక్కిలి సుభాషితమనియే చెప్పవలసి యున్నది.

కాని, ఆ శంకర భగవత్పాదులే పది సూత్రములకు తరువాత స్వయముగా (శుగస్య తదనాదర శ్రవణాత్) అను సూత్రమును వివరించుచు నట శూద్రులకు శాస్త్రమునందధికారము లేదని నిశ్శంకముగా నిర్ణయించుచున్నారు. ఈ నిర్ణయమును చూచినపుడు ఆచార్యు లిట్టి స్వవచనవ్యాఘాతమున కేల బూనుకొనియుందురా! యని యాశ్చర్యము గొలుపకపోదు. ఈ ప్రసంగమున శూద్రులనగా నాచార్యులు జాతి శూద్రులు (శూద్రస్త్రీయందు శూద్రునకు బుట్టినవారు) అని భావించు చున్నారు. జాతిశూద్రులు మనుష్యులు కారా? మనుష్య మాత్రుల కధికారమున్న శాస్త్రమున శూద్రుల కేల యధికారముండ రాదు? ఈశ్వరీయములగు వేదములనుండి వారెట్లు వంచింపబడుదురు? వ్యాసుడు తనచే రచియింపబడిన సూత్రమునందు (మనుష్యాధికార

త్వాత్) మనుష్యమాత్రునకధికారమున్నదని కంఠోక్తిగా చెప్పిన ట్లంగీకరించిన శంకరస్వామి లిట శూద్రులకు శాస్త్రమున నధికారము లేదనుట యెట్లు సంగతమగును? ఈ నిర్ణయ మనార్షము, అవైదికము, అయౌక్తికము, పక్షపాత పూర్ణము, రాగద్వేషప్రయుక్తము నని వ్రాయుచున్న నాధార్ష్ట్యమును పాఠకులు మన్నింతురు గాక!

అపశూద్రాధికరణమని పేరిడిన సూత్రములలో నైదింటి యందును నెక్కడను శాస్త్రమున శూద్రున కధికారము లేదని చెప్పుటకు తగిన శబ్దములుకాని, ఆధారములుగాని లేకున్నను శంకరస్వాములు, రామానుజ స్వాములు వారికి తరువాత వచ్చిన వారి యనుచరులు నెల్లరు నుపర్యుక్త సూత్రములను వివరించుచు, బలవంతముగా నిట శూద్రప్రసక్తిని కలిగించి వారికి శాస్త్రమును నిషేధించియున్నారు. ఈ నిర్ణయము చేయుటకు శంకరస్వాములు ఎంతగానో ప్రయాసపడియున్నారు. ఇక వారి యనుచరులు స్వాముల నిర్ణయమును బలపఱచుటకు మిథ్యాకల్పనలను కూడ చేసియున్నారు. ఇట్టి స్థలములను బాగుగ చూచినపుడు శాస్త్రములందాచార్యులు, సాంప్రదాయకులు నెన్నో కుట్రలు పన్ని మానవులలో కొంద అను జ్ఞానమునకు దూరముగా నుంచ యత్నించినట్లు స్పష్టము కాకపోదు.

శూద్రులకు వేదశాస్త్రములు చదువు నధికారము లేదని సిద్ధాంతము చేయుట కీ యపశూద్రాధికరణమునందు ఛాందోగ్యోపనిషత్తునుండి రెండు ప్రసంగముల నుదాహరించి యున్నారు. అందొకటి జానశ్రుతికి చెందినది; రెండవది జాబాలి సత్యకామునికి. జానశ్రుతి, సత్యకాముడు నను వీరిరువురును జన్మతః శూద్రులు కారనియు, జానశ్రుతి జన్మతః క్షత్రియుడనియు, సత్యకాముడు జన్మతః బ్రాహ్మణుడనియు సాధించి, యందువలన వారికి బ్రహ్మవిద్యయందు నధికారము కలిగినది. కావున జాతిశూద్రులకు వేదము చదువు నధికారము లేదని సిద్ధాంతీకరించిరి.

ఇక్కడ పాఠకులు గమనింపదగిన విషయము లివి. ఒకటి జానశ్రుతి జన్మతః క్షత్రియుడా? కాడా? రెండవది సత్యకాముడు జాతి బ్రాహ్మణుడా? కాడా? మూడవది వీరికి బ్రహ్మవిద్యయం దధికారము కలుగుటకు కారణము జన్మమా? లేక గుణకర్మ స్వభావములా? నాలుగవది వీరికి జన్మము కారణముగా విద్య లభించిన లభించునుగాక!

వీరికి విద్యయం దధికారము గలుగుట జాతిశూద్రుల శాస్త్రాధికారము నెట్లు నిషేధింపగల్గును? ఈ విషయములు పాఠకులు బాగుగ గమనించుట కనువగునట్లు పైజెప్పిన రెండు ప్రసంగముల నొకదాని తరువాత మఱియొకటి యుపనిషత్తులో నున్నట్లు ఇక్కడ వ్రాయుచున్నాడ. వాని జదివి పాఠకులు శంకరస్వాముల నిర్ణయములోగల గుణదోషములను, ఔచిత్యానౌచిత్యములను బాగుగ గుర్తింపగలుగుదురుగాక!

ఛాందోగ్యోపనిషత్తు చతుర్థ ప్రపాఠకము 1, 2, 3 ఖండములలో జానశ్రుతి వృత్తాంత మిట్లున్నది:-

ప్రాచీనకాలములో జానశ్రుతి యను వాడొకడుండెను. అతడు పుత్రపౌత్రులు గలవాడై పౌత్రాయణుడనబడెడివాడు. అతడు శ్రద్ధాళువు; మిక్కిలిదాత; అన్నప్రదాత; అతిథులు నివసించుటకు, అన్నపానములు గ్రహించుటకు వీలుగ ననేక సత్రములు కట్టించినవాడు.

ఒకనాటి రాత్రి కతిపయ పరమహంస లా జానశ్రుతి ప్రాసాదమున కేతెంచిరి. అందొకరు మఱియొకరితో 'భల్లాక్ష! జానశ్రుతి యశస్సు ద్యులోకమువలె నంతట వ్యాపించుచున్నది. దాని నుల్లంఘింపకుము. ఆ జ్యోతి నిన్ను దహింపకుండునుగాక' అనెను. అదివిని ఎవనిని 'నీ వింతగా పొగడుచున్నావో అతడేమి రైక్వుడా? రైక్వునకు తెలిసిన రహస్యము నెఱిగినవాడే తెలిసినవాడు' అని రెండవ పరమహంస సోపహాసముగా బదులు చెప్పెను. జానశ్రుతి యాసంవాదమును విని మఱునాడు రైక్వ ఋషిని వెదక తనసారథిని బంపెను. అతడన్వేషించివచ్చి 'రైక్వమహర్షిని జూచి వచ్చినాడ. అతడొక బండిసీడను గూర్చుండి యొడలి దురదను బాపుకొనుటకు గోళ్ళతో గోకికొనుచున్నాడు' అని జానశ్రుతికి బదులు చెప్పెను.

అంతట నా జానశ్రుతి యాఱువందల గోవులను, నొకరత్నహారమును, కంచరగాడెదలం బూన్చిన రథమును తీసికొనిపోయి రైక్వున కర్పించి యుపదేశింపుడని యర్థించెను. రైక్వుడతనిం జూచి 'అరే! శూద్ర! యివి యన్నియు నీయొద్దనే యుంచుకొనుము' అనెను. జానశ్రుతి మరల నొక వేయిగోవులను, రత్నహారమును, రథమును, తన పుత్రికను గొనిపోయి ఋషికి నర్పించి యుపదేశము నర్థించెను. అంతట

నా రైక్వుడు రెండవసారికూడ 'ఓ శూద్ర! నీవు తెచ్చిన గోవులకు నీవి మియు పలుకువాడ గాను. కాని యీ కన్యాముఖ్యమువలన నామోహమువలన వచ్చుటచే నేను మాటాడవలసి వచ్చినది' అని యనుచునే సంవర్గవిద్య నుపదేశించియుండెను.

జానశ్రుతి వృత్తాంతమిది. శంకరభాష్యము నీ ప్రసంగమునుదాహరించి శూద్రులకు వేదశాస్త్రములందధికారములేదని నిర్ణయించియున్నారు. ఈ ప్రసంగము జదివినవారి కిందు శూద్రులకు శాస్త్రాధికారమును నిషేధించుటకు గల కారణము దురూహ్యముగా దోచును. ఇంతేగాక రైక్వుడు జానశ్రుతిని రెండు పర్యాయములు శూద్ర! యని సంబోధించి తరువాత సంవర్గవిద్యను బోధించియున్నందునను, అసంవర్గవిద్య బ్రహ్మవిద్య యగుట వలనను శూద్రులకు బ్రహ్మవిద్యయం దధికారమున్నట్లు స్పష్టమగుచున్నది. కాని శంకరాచార్య లిందుకు విపరీతముగ, రైక్వునిచే జానశ్రుతి శూద్ర! యని సంబోధింపబడినప్పటికిని నతడు జాతిశూద్రుడు కాడనియు, నతడు వాస్తవమున జాతిక్షత్రియుడనియు చెప్పి, యందువలననే రైక్వుడు జానశ్రుతికి సంవర్గవిద్య నుపదేశించి యున్నాడు; కావున జాతిశూద్రునకు శాస్త్రమున నధికారము లేదనుచున్నారు.

చూచితిరా! ఆచార్యుల సాధన! జానశ్రుతి యితివృత్తమును తెలుపు ప్రసంగములో నెటనైన నతని జాతిక్షత్రియత్వముమ దెలుపు పదము లున్నవా? లేవు. క్షత్రియుడని తెలుపు పదములు లేకపోగా నతడు శూద్రుడమటకు తగినట్లు రైక్వు డతనిని రెండు పర్యాయములు శూద్ర! అని వ్యవహరించియున్నాడు గదా! అతడెట్లు క్షత్రియుడయ్యెను స్వామీ? యని యాచార్యులను ప్రశ్నించిన వారేమందురో చూతుడు. 'ప్రసంగములో క్షత్రియత్వమును బోధించు పదములులేకున్నను జానశ్రుతి క్షత్రియుడే యగును. కారణమేమన:- ఈ జానశ్రుతికి అభిప్రతారి యను నొక క్షత్రియునితో సంబంధమున్నట్లు ఛాందోగ్యములోని తరువాత ప్రసంగమును జదివిన బోధపడగలదు. అనగా అభిప్రతారి యనునొక క్షత్రియుడు సంవర్గవిద్యను నేర్చుకొనెను. ఆ సంవర్గవిద్యనే జానశ్రుతియు నేర్చుకొని యున్నాడు. ఈ యిరువురు నేర్చినది యొకేవిద్య కాబట్టి యా విద్య ద్వారా వీరి కిరువురకును సంబంధ (బాదరాయణ సంబంధ) మేర్పడు

మున్నది. ఈ విధముగ క్షత్రియుడయిన అభిప్రతారితో సంబంధముండుట [illegible] క్షత్రియత్వమును దెలుపు పదములు, [illegible] జానశ్రుతి [illegible] జాతిక్షత్రియుడే కాని శూద్రుడు [illegible] [illegible] జాతిక్షత్రియుడే కాని శూద్రుడు [illegible] [illegible] [illegible] భాష్యమును వ్రాసియున్నారు. శంకరస్వాములు [illegible] ప్రబలవ. గా నున్నదో చూడుడు! అభిప్ర [illegible] నగిరియున్నారు; కావున; అభిప్రతారి [illegible] జాతిక్షత్రియుడే. ఒకేవిధ్య నిరుపుడు క్షత్రియ [illegible] క్షత్రియుడు కావున రెండవ వాడును [illegible] [illegible] ! స్వాముల కింతకంటె వేఱొక ప్రమాణ [illegible] [illegible] చేయగలరు? [illegible] ప్రకారేణ [illegible] [illegible] వలసి వచ్చినది. లేకున్న శూద్రులకు [illegible] [illegible] లభింపగలదేమో? పుట్టినను గునేమో? [illegible] శాస్త్రమున నధికారము లభింపగలదేమో? పుట్టినను గునేమో? [illegible] [illegible] ఈ [illegible] తప్పించి శాస్త్రము నొద్దన వేయవలసిన [illegible] ఆచార్యులపై బడినది.

పోనిండు; అభిప్రతారియైనను జాతిక్షత్రియుడే యని ఉపనిషత్తులో స్పష్టముగా వర్ణింపబడినదా? అటియును లేదు. అందువలన 'నభిప్రతారి క్షత్రియు డెట్లయ్యెను?' అను శంకరస్వాముల నడిగిన వారందుల కేమనిరో చూడుడు. (అథ హ శౌనకం చ కాపేయ మభిప్రతారిణం చ కాక్షసేనిం పరివిష్యమాణౌ బ్రహ్మచారీ బిభిక్షే. ఛాం. 4.3.5) "శునకుని పుత్రుడు కాపేయుడు, కక్షసేనుని కొడుకు అభిప్రతారియు నిద్దఱు నొకచో భోజనార్థమై కూర్చుండగా నొక బ్రహ్మచారి వారిని భిక్షనడిగెను" అను ప్రసంగము నుదాహరించి స్వాము లిట్లనుచున్నారు. కాపేయుడు యాజకుడు పురోహితుడు. అభిప్రతారి యతనితో భోజనార్థ మొకపంక్తిలో కూర్చుండెను. అట్టి సమయమున నొక బ్రహ్మచారి వారిని భిక్షనడిగెను. కావున, అభిప్రతారి క్షత్రియుడై యుండవ లయును. కాకున్న నతడు బ్రాహ్మణుడైన కాపేయునితో భోజనార్థ మెట్లు కూర్చుండగలడు? బ్రహ్మచారి యతని నెట్లు యాచింపగలడు? బ్రహ్మచారి బ్రాహ్మణుడై యుండవలయును. బ్రాహ్మణుడు శూద్రుని యాచింపడు. కావున అభిప్రతారి క్షత్రియుడై యుండవలయును.

ఈ ప్రసంగమును జదివిన తరువాతగూడ అభిప్రతారియను క్షత్రియుడని నిర్ణయించుటకు తగిన ప్రబల ప్రమాణాలు ఆచార్యులకు లభింపలేదనియే స్పష్టమగుచున్నది. కంఠోక్తిగా అభిప్రతారి క్షత్రియుడని చెప్పబడలేదు. అతడు క్షత్రియుడనుటకు పురోహిత కులమువాడైన కాపేయునితో కలిసి భోజనమున కొకచో కూర్చుండుటయు, బ్రహ్మచారిచే యాచింపబడుటయు తప్ప వేఱు ప్రమాణముకాని, క్షత్రియబోధక పదములుకాని దొరకదు. అందువలన అభిప్రతారి జాతిక్షత్రియుడనుటయు సందిగ్ధమే యగుచున్నది. ఇట్టి సందిగ్ధ జాతి క్షత్రియునితో బాదరాయణ సంబంధము కల్పించి దానిద్వారా జానశ్రుతి జాతిక్షత్రియు డనుట యెంత యుక్తి యుక్తమో పాఠకు లాలోచింతురుగాక! దీనింబట్టి శంకరస్వాము లెంతటికైన ఘటికులనక తప్పదు.

"కాపేయునితో సంబంధమున్నంత మాత్రాన అభిప్రతారి క్షత్రియు డని యెందుల కంగీకరింపవలయును స్వామీ?" అని శంకరుల నడిగిన వా రిట్లనుచున్నారు. 'తాండ్యబ్రాహ్మణమున నొకచో' (ఏతేన వై చిత్రరథం కాపేయా అయాజయన్. తాం.బ్రా.20.2.5) 'చిత్రరథు నిచే కాపేయులు యజ్ఞము చేయించిరి'. ఈ వాక్యమునుబట్టి 'కాపేయులు యాజకులనియు' వారిచే యజ్ఞముచేయింపబడినవాడు కావున చిత్రరథుడు క్షత్రియు డనియు తెలియుచున్నదట!' యజ్ఞము చేయించినందున కాపేయులు పురోహితులు, బ్రాహ్మణులునని యొప్పుకొనవచ్చునేమోకాని, అంతమాత్రమున చిత్రరథుడు క్షత్రియు డెట్లయ్యెనని యాచార్యుల నడుగుదుమేని ఆచార్యులు తమ భాష్యమందు (తస్మాత్ చైత్రరథిర్నామ ఏకః క్షత్రపతి రజాయత) అందువలన చైత్రరథియను నొకడు క్షత్రపతి యయ్యెను' అను నొక వాక్యము నుద్ధరించి చిత్రరథుడు క్షత్రియుడని సాధించియున్నారు. కాని ఈ వాక్యమెక్కడిదో తెలియదు. ఈ యజ్ఞాతవాక్యప్రమాణముతో చైత్రరథుడు క్షత్రియుడైనాడు. అట్టి చైత్రరథునకు పురోహితులు కాపేయులు. **అట్టి కాపేయవంశజునితో నొకే పంక్తియందు భోజనార్థమై కూర్చున్నాడు. కావున అభిప్రతారి చిత్రరథ క్షత్రియవంశ సంబంధియగునట! అందువలన నతడు క్షత్రియుడు! అట్టి క్షత్రియుడు నేర్చిన సంవర్గవిద్య నెన్నడో నేర్చినవాడు కావున జానశ్రుతి**

తప్పక జాతిక్షత్రియుడై యుండవలయునట! అహో!

ఈ సాధనపరంపరను తెలిసికొనిన తరువాత పాఠకులకు శంకర స్వాము లెంత ప్రయాసబడి జానశ్రుతి క్షత్రియత్వమును నిరూపించిరో బాగుగ బోధపడి యుండునని యెంచెద. ఈ సాధనను బట్టి జానశ్రుతి జాతిక్షత్రియుడని యెవరైన నంగీకరింపగలరా? ఇందు గనబఱచిన సంబంధము లన్నియు బాదరాయణ సంబంధములుకాక మఱియేమగును? ఇందుకు విపరీతముగ 'జానశ్రుతి శూద్రుడు కాబట్టి వానితో సంబంధ మున్నందున అభిప్రతారి, కాపేయుడు, బ్రహ్మచారి, చైత్రరథుడు ఎల్లరు శూద్రులే యగుదురు. క్షత్రియులుకాని, బ్రాహ్మణులుకాని కారు' అని యెవరైన నందురేని శంకరస్వాములు తనపక్షమును సాధించుట కేమి ప్రమాణము నీయగలరు? స్వాముల సాధన డొంకతిరుగుడుగా లేదా?

ఈ సాధనలో బలమేమియు లేదని యెంచియే కాబోలు శంకర స్వాములు రైక్వునిచే జానశ్రుతికై ప్రయోగింపబడిన శూద్రపదమునకు రూఢ్యర్థము నంగీకరింపక (శుచా ద్రవతీతి శోకేన ద్రుద్రావ ఇతివా శూద్రః) 'శోకముచే పరువిడుటచే నితడు (జానశ్రుతి) శూద్రుడన బడినాడ'ని యౌగి కార్థమును చెప్పినారు. అంతటితో నూరుకొనక 'శూద్ర! అని సంబోధించి రైక్వుడు తన సర్వజ్ఞత్వమును వెల్లడించినాడు. అందులకే జాతిక్షత్రియుడైన జానశ్రుతిని 'శూద్ర!' అని పిలిచినాడు' అనియు వ్రాసినారు. అహో! శంకరస్వాములయూహ నేమని కొనియా డవలయునో తోచకున్నది. ఈ యుక్తులచే జానశ్రుతి జాతిక్షత్రియుడని యెట్లు బోధపడగలదు? శూద్రపదమునకు యౌగికార్థము కల్పించినం దున నిట జానశ్రుతి శోకముతో వచ్చినవాడని తెలియు ననుకొందము. అంతేకాని యతడు జన్మతః శూద్రుడు కాడనికాని, క్షత్రియుడైనట్లుకాని ఎట్లు తెలియుగలదు? శోకముతో వచ్చినవారెల్లరు జాతిక్షత్రియులగుదురా? జాతి శూద్రుడు కాడని యన్నంత మాత్రమున నాకడు జాతిక్ష త్రియు డగునా? బ్రాహ్మణుడేల కారాదు? ఇందులకు నియామకమేమి? ఇంతేకాక ఆచార్యులచే ప్రదర్శింపబడిన యీయుక్తులు జానశ్రుతి జాతిక్ష త్రియుడని సాధించుటకు బదులతడు శూద్రుడుకాడనియు, శోకార్తుడై వచ్చినవాడనియు మాత్రము బోధపడుచును.

రైక్వుడు తన సర్వజ్ఞత్వమును వెల్లడించుటకై క్షత్రియుడైన జాన శ్రుతిని "శూద్ర" అని శూద్రపదముచే సంబోధించి నాడనుట మఱియు వింతగొలుపుచున్నది. ఒకవేళ పిలిచినాడే యనుకొందము. దానివ లన జానశ్రుతికి క్షత్రియత్వ మెట్లు సిద్ధించును? అయ్యది సిద్ధింపకపోగా రైక్వుని స్వాభిమానమును. ఆత్మస్తుతిని తెలియజేయుచున్నదని యెంచ వలసి వచ్చుచున్నది. రైక్వుడు మహర్షి; బ్రహ్మవిదుడు, ఏషణత్రయమును వర్జించి యరణ్యమున నొంటరిగా నొక బండిసీడను బడియున్నవాడు. అట్టి వాడు తనకడ కరుదెంచిన క్షత్రియుని శూద్రపదముచే సంబోధించి తన సర్వజ్ఞత్వమును దెలుపు కొనుటలో గల ఘనత యేమున్నది? తన సర్వ జ్ఞత్వమును సూచించి జానశ్రుతినుండి పొందవలసిన దతని కేమిగలదు? పరమహంసల సంవాదము మూలమున రైక్వుని మాహాత్మ్యము జానశ్రుతి కంతకుపూర్వము తెలిసియేయుండెనుగదా! అట్టివానికి మరల తన సర్వ జ్ఞత్వమును దెలుపు కొనుటలోగల యౌచిత్యమేమున్నది? అందువలన నీ యుక్తులును ఆచార్యుల సాధన కేమియు తోడ్పడుచున్నట్లు కానరావు. శంకరస్వాము లీసంగతిని గుర్తించియే యున్నారు. కావుననే చివరకు జానశ్రుతి క్షత్రియత్వమును సాధించుటకు మఱియొకయుక్తిని ప్రదర్శించి యున్నారు. పాఠకులు దానిని కూడ గమనింతురుగాక.

జానశ్రుతికి రథము నడపుట కొక సారథి యున్నాడు. గోవుల సంపద యున్నది. రత్నహారము లున్నవి. దానాది గుణములలో నతడు ప్రసిద్ధుడు. అందువలన నతడు క్షత్రియుడనియే యెఱుగవలయునట!

ఆచార్యు లొసంగిన యీ చివరి హేతువు వలనను జాతి క్షత్రియ త్వమెట్లు సిద్ధించునో తెలియకున్నది. సారథి, ఐశ్వర్యాదులు నొకని కున్నంతమాత్రమున నతడు జన్మతః క్షత్రియుడని యెట్లు బోధపడును? అటులయిన నైశ్వర్యము కలవారందఱు క్షత్రియులే కావలసివత్తురు. ఐశ్వర్యాదులు జన్మమునకు బోధకములా? ఎన్నటికిని కాజాలవు.

అప్రతిమ ప్రతిభులయిన శంకరభగవత్పాదులు, అనుపమయుక్తులతో బౌద్ధాది యవైదిక మతములను ఖండించిన మహామతులు నీ ప్రసంగ మున నెందుల కింతటి దుర్బల యుక్తుల నాశ్రయించిరో బోధపడ

కున్నది. పాపము! ఏమి చేయగలరు? ప్రబలయుక్తులు దొరకనపుడు దుర్బలయుక్తుల నుపయోగింపక చేయవలసిన దేమున్నది? అట్లు చేయకపోయిన శూద్రులకు వేదమున నధికారము సిద్ధించునేమో! కావున శూద్రులకు శాస్త్రమున నధికారము లేకుండ జేయుటకై శంకరాచార్యులింతగా పాటుపడవలసె వచ్చినది. కాని యిట్టి దుర్బలయుక్తులు తమ కీర్తిప్రతిష్ఠల కెంతటి హాని కలిగించునో గుర్తింపకుండుట శోచనీయము, ఆచార్యుల పాండిత్యమునకు, రచనాకౌశలమునకు ముగ్ధులముకాక వారి ప్రసంగమున నొసంగిన యుక్తులను క్రమముగా పరిశీలించి చూచినచో నన్నియు యుక్త్యాభాసములే యని బోధపడకపోదు. ఇది యంతయు జూడగా నేదోయొకవిధము నాశ్రయించి శూద్రులకు శాస్త్రమునం నధికారము లేకుండ జేయుటకై శంకరస్వాములు ఎంతగానో ప్రయాసపడినట్లు స్పష్టమగుచున్నది. ఇంతటి ప్రయాస మొనరించియు వారిందు పొందిన సాఫల్యమేమియు కానరాదు. నిష్పాక్షికులగు పాఠకులకు శంకరస్వాముల పరిశ్రమము న్యాయయుక్తము, సముచితమునని యెన్నటికిని భాసింపదనియే నా నిశ్చయము.

ఇక రెండవ ప్రసంగము సత్యకామునిది. శూద్రులకు శాస్త్రమున నధికారములేదని సాధించుట కీ ప్రసంగమును కూడ నీ యపశూద్రాధికరణమున శ్రీశంకరు లుల్లేఖించి యున్నారు. దానిని కూడ పరిశీలింతము. (తదభావనిర్ధారణే చ. 1.3-35) అను బ్రహ్మసూత్రమును వివరించుచు శంకరస్వాములు సత్యకాముని ప్రసంగము నుదాహరించి శూద్రులకు శాస్త్రమున నధికారము లేదని సాధించియున్నారు. సత్యకాముని కథ ఛాందోగ్యోపనిషత్తు చతుర్థప్రపాఠకములో నిట్లున్నది:-

ఒకమాటు జబాల యను నామె పుత్రుడు సత్యకాముడు బ్రహ్మచర్యవ్రత మొనర్పనెంచి తనతల్లిని "నా గోత్రమేమి" యని యడిగెను. అందుల కామె పుత్రునితో (నాహమేతద్ వేద తాతః యద్ గోత్రస్త్వమసి. బహ్వహం చరన్తీ పరిచారిణీ యౌవనే త్వామలభే. సాహ మేతన్నవేద యద్ గోత్రస్త్వమసి. జబాలా తు నామాహమస్మి. సత్యకామో నామ త్వమసి. సత్యకామ ఏవ జాబాలో బ్రువీథా ఇతి) "వత్స! నా పేరు జబాల. నీ గోత్రము నాకు తెలియుదు. అనేకులను చరించుచు పరిచా

రిక నగు నేను యౌవనమున నిన్ను గంటిని. అందువలన నీ గోత్రము నెఱుగజాల నైతిని. నా పేరు జబాల. నీ పేరు సత్యకాముడు. జాబాలి, సత్యకాముడ ననియే చెప్పుము" అని బదులు చెప్పినది.

సత్యకాము డంతట గోతమ వంశజుడైన హారిద్రుమతుని చెంతజేరి 'భగవన్! బ్రహ్మచర్యము వసింతును. నన్నుపనయింతురుగాక' యని యర్థించెను. అందుల కా గౌతముడు 'సౌమ్యా! నీ గోత్రమేమి?' యని ప్రశ్నింపగా సత్యకాముడు తన తల్లి చెప్పిన మాటల నట్లే తు.చ. తప్పకుండ బదులు చెప్పెను. అంతట నా ముని, (నైతదబ్రాహ్మణో వివక్తు మర్హతి. సమిధం సోమ్యాహార ఉపత్వానేష్యే న సత్యాదగాః) 'అ బ్రాహ్మణు డిట్లు చెప్పడు. సోమ్య, ఇంధనములను తెమ్ము; నిన్ను ఉపనయింతును. నీవు సత్యమునుండి తొలగవైతివి' యని యతనికి దీక్ష నొసంగి విద్యాదానము చేసియుండెను.

ఇయ్యది సత్యకాముని ప్రసంగము. ఈ ప్రసంగము నుల్లేఖించి యాచార్యులు (యత్ సత్యవచనేన శూద్రత్వాభావే నిర్ధారితే జాబాలం గౌతమ ఉపనేతు మనుశాసితుం చ ప్రవవృతే). 'సత్యమాడినందున శూద్రత్వాభావము నిర్ధారణము కాగా గౌతముడు సత్యకాము నుపనయించి యనుశాసించుటకు ప్రవృత్తుడయ్యెను' అని వ్రాసి యంతమున 'కాబట్టి శూద్రునకు శాస్త్రమున నధికారము లే' దని నిర్ణయించి యున్నారు.

చూచితిరా శంకరస్వాముల సాధన! సత్యకాముడు సత్యమాడినందున నతడు బ్రాహ్మణుడు కాదగునని నిర్ణయించి గోతము డతనికి నుపనయన మొనర్చి విద్య ననుగ్రహించి యుండెను. దీనివలన జాతి బ్రాహ్మణునకు శాస్త్రమున నధికార మున్నదనియు, జాతిశూద్రునకు లేదనియు నెట్లు సాధింప వీలగును? పాఠకులు గమనింతురుగాక!

సత్యకాముని తల్లి జబాల. ఆమె పరిచారిక. అనేకులను చరించుచు యౌవనమున సత్యకాముని గన్నది. తల్లి తనకు చెప్పిన మాటలను సత్యకాముడు గౌతమునకు చెప్పినాడు. ఈ ప్రసంగమును జదివి యెవరైనను సత్యకాముడు జాతి బ్రాహ్మణుడు అనగా జన్మతః బ్రాహ్మణ దంపతులకు బుట్టినవాడు; అని యెంచగలరా? లేదు. పైపెచ్చు అజ్ఞాత కులగోత్రుడని

స్పష్టముగా ప్రసంగమునలేదా? ఐనను సత్యకాముడు శంకరస్వాముల దృష్టిలో జాతి బ్రాహ్మణుడే యయ్యెను. ఆచార్యుల నే మనగలము? జబాల తనను గుఱించి బ్రాహ్మణి యనియైనను చెప్పక పరిచారిక నని చెప్పుకొన్నది. బ్రాహ్మణి యగుచో పరిచారిక యెట్లగును? ఆచార్యుల మతమున బ్రహ్మచారి శూద్రుని యాచించుటకే వీలుకానపుడు బ్రాహ్మణి శూద్రవృత్తియైన పరిచర్య నెట్లు గ్రహింపగలదు? దారిద్ర్యముచే నట్లు గ్రహింపవచ్చు నందురేని బ్రహ్మచారి ధనికుడైన శూద్రుని యాచించు టలో గలదోషమేమి! వృత్తియెట్టిదైనను తన్ను దా బ్రాహ్మణి యని చెప్పుటలో జబాలకు కలిగిన యాటంకమేమి? మఱియు, 'అనేకులను చరించుచు యౌవనమున నిన్ను గంటిని అని చెప్పుటవలన సత్యకా ముడు వ్యభిచారజన్ముడని తెలియుట లేదా? అట్టివాడు శూద్రునికంటె నికృష్టుడే యగును; కాని జాతిబ్రాహ్మణు డెట్లు కాగలడు? అజ్ఞాత కులగోత్రుడు, వ్యభిచారజన్ముడునైన సత్యకామునకు సత్యభాషణము కారణముగా గౌతము డువనయన మొనర్చి శాస్త్రము నభ్యసింపజేసినట్లు ప్రసంగము స్పష్టపఱచుచుండగా నా ప్రసంగమునే యాధారముగా గొని 'శూద్ర జన్ములకు శాస్త్రమున నధికారము లేదు' అని నిర్ణయించుట యాచార్యులకే చెల్లుబడి కాగలదు. ఇతరు లిట్టి నిర్ణయమును జేసిన పరీక్షకు లా నిర్ణయమును నప్రామాణికము, నసంగతమునని త్రోసివు చ్చకుందురా?

శంకరస్వాముల వచనమును బట్టి చూచినను సత్యకాముడు జాతి బ్రాహ్మణు డెట్లు కాగలడు? శంకరులు (సత్యవచనేన శూద్రత్వాభావే నిర్ధారితే) 'సత్యవచనముచే శూద్రత్వా భావము నిర్ధారణము కాగా' అనుటను బట్టి శూద్రత్వా భావమును నిర్ణయించుటకు సత్యవచనము కారణమైనట్లు శంకరులే యంగీకరించుచున్నారు. శూద్రత్వము సత్యకాముని యందు లేదని సత్యవచనము వలనగదా తెలిసినది. 'సత్యకాముని యందు శూద్రత్వము లేదు' అనియే సత్యవచనము వలన తెలిసినది. బ్రాహ్మణ జన్ముడని సత్యవచనము చెప్పలేదుగదా! శూద్రులు కాని వారం దఱు బ్రాహ్మణులని నిర్ణయింపనగునా? సత్యవచనము శూద్రత్వాభావ మును నిర్ణయించుచున్నదని చెప్పుచు న్యాయముగా శంకరులు సత్యకాముడు

బ్రాహ్మణుడని యెట్లు చెప్పగలరో తెలియకున్నది. ఒకవేళ సత్యభాషణము బ్రాహ్మణత్వమునకు ద్యోతకమని యంగీకరింతుమేని బ్రాహ్మణత్వమునకు సత్యభాషణాది గుణములే కారణములు కాని జన్మకాదని నిర్ణయమగును. అందువలన సత్యకాముడు జాతి బ్రాహ్మణుడేకాక, జన్మతో సంకరుడయినను సత్యభాషణముచే బ్రాహ్మణు డయినట్లు సిద్ధాంతమగును. అట్లు సిద్ధాంతము చేయుట శంకరస్వాముల కిష్టములేదు. కారణమేమన:- అట్లంగీకరించినచో సత్యమాడు వారందఱు బ్రాహ్మణులగుదురు. శూద్ర జన్ములుకూడ సత్యమాడి బ్రాహ్మణులయి శాస్త్రమున కధికారుల గుదురు. అప్పుడు పుట్టి మునిగిపోవును. ఆచార్యుల పరిశ్రమ మంతయు వ్యర్థమగును. వారు చేసిన కుట్ర ఫలింపదు. గుణవంతులెల్లరు విద్యావంతులై బాగుపడిపోవుదురు. ఇది యెంతటి యనర్థమునకు దారితీయునో కదా! అందఱు విజ్ఞానవంతులైన ప్రపంచము నడవగలదా? కాబట్టి సత్యమాడినంత మాత్రమున బ్రాహ్మణుడగునను సిద్ధాంతము శంకరుల కిష్టముకాదు. అటులయిన సత్యకాముడు బ్రాహ్మణు డెట్లయ్యెను? ఈ ప్రశ్న మళ్లే నిలిచిపోవుచున్నది.

జబాల చెప్పిన వృత్తమును బట్టి సత్యకాముడు వ్యభిచారజన్ముడని స్పష్టపడుచున్నను, 'సత్య మాడినందున బ్రాహ్మణునకే యతడు జన్మించినాడు; అందువలననే యతడు సత్యమాడ గలిగినాడని' యంగీకరింతుమేని, నేటి బ్రాహ్మణ జన్ములందఱు సత్యభాషులే కావలసియుందురు. అందఱు వశిష్ఠ వామదేవ భారద్వాజస గోత్రములందు జన్మించిన వారేకదా? మఱి వీరందఱు సత్యమాడరేల? అబద్ధము లాడుచున్నారు. కావున వీరు బ్రాహ్మణ జన్ములు - జాతిబ్రాహ్మణులు కారనియన వచ్చునా? అట్లనుట యపచారమగును. కాబట్టి బ్రాహ్మణులకు జన్మించుట సత్యభాషణమునకు నియామకము కాదని బోధపడుచున్నది. అటులయిన సత్యమాడినంత మాత్రమున సత్యకాముడు జాతి బ్రాహ్మణుడని శంకరస్వాము లెట్లు నిర్ణయించుచున్నారు? ఎన్ని విధముల నాలోచించినను ఆచార్యుల నిర్ణయము యుక్తి సంగతముగా కనబడదు. యుక్తి ప్రమాణములతో సత్యకాముడు బ్రాహ్మణుడు కాడని సిద్ధించినను శంకరస్వాములు మహాయోగులు కావున సమాధినిష్ఠులైయతని బ్రాహ్మణత్వమును

- బ్రాహ్మణజన్మతను, తెలిసికొని యుందురని యెవరేని చెప్పిన దానికి నేను దాసోహమ్మనక తప్పదు. వారి యోగశక్తిని శంకింప నేనెంత వాడను? కాని, అప్పటి యుక్తి ప్రయుక్తులను ప్రయోగించుట వ్యర్థము నక తప్పదు. అసలు శంకరస్వాములు స్వయముగా శూద్ర జన్ములెంత గుణవంతులైనను జదువరాదని యనుశాసించిన కాదనువా రెవరు? ఇంత వ్యర్థప్రయాసముచేసి యెందుల కీ నాటకమాడిరో యర్థము కాకున్నది.

ఆచార్యుల స్థితి యిట్లుండగా వారి యనుచరులలో మహావిద్వాంసు లనదగు వాచస్పతిమిశ్రు లీ సందర్భమున నెట్లు వ్యాఖ్యానము చేసియు న్నారో చూడుడు. వారివ్యాఖ్యానము జదివినపుడు 'అతసికంటె ఘనుడు ఆచంట మల్లన్న' యను సామెత స్మరణకు రాకమానదు.

అపశూద్రాధికరణమున గల సూత్ర భాష్యమును వివరించుచు వాచ స్పతిమిశ్రు లీప్రసంగము నిట్లు సమర్థించుచున్నారు. (త్వజ్జనక పరిచరణ పరతయా నాహమజ్ఞాసిషం గోత్రం తవ). 'నీ జనకుని పరిచర్యాపర నైనీ గోత్రము నెఱుగనైతిని' అని జబాల సత్యకామునితో చెప్పినట్లు ఒక క్రొత్త వాక్యమునే వాచస్పతులు సృష్టించియున్నారు. వాచస్పతు లైరి! వారికి వాగ్రచనలో లోటేమున్నది? సమర్థు లేది వ్రాసినను చెల్లుబడి యగునని యెంచి వ్రాసినట్లున్నది. అందువలననే కాబోలు గోసాయి తులసీదాసు (సమరథకో నహి దోస గుసాయీ) సమర్థునకు దోషము లేదన్నారు. లేకున్న ఉపనిషత్తునందు (బహ్వాహం చరన్తీ పరి చారిణీ యౌవనే త్వామలభే) 'అనేకుల జరించుచు యౌవనమున నిన్ను గంటిని' అని జబాల చెప్పినదని యుండగా నాజబాల కొకపతిని గల్పించి, వానిని సత్యకామునకు జనకునిగాజేసి యతని పరిచర్యలో మునిగి తేలుచు జబాల సత్యకాముని గోత్రమును తెలిసికొనజాలక పోయినది అని చెప్పి సత్యకాముడు జాతి బ్రాహ్మణుడే యని వాచస్పతు లెందుకు సాధింప బూనుదురు?

ఇది యంతయు జూడ శూద్రులను శాస్త్రజ్ఞానమునుండి వంచింపజే యుటకు పన్నిన పన్నుగడగా కనబడుటలేదా! లేకున్న నీ యప శూద్రాధి కరణమునకు వేఱొండు ప్రయోజనమే కన్పింపదు. శూద్రజన్ములయెడ

బ్రాహ్మణ నామధారులకు గల యసూయ, ద్వేషము నీ యధికరణము చెప్పక చెప్పుచున్నది. శంకరస్వాములవంటి యాచార్యులకు శూద్రజన్మ లయెడ నెంతటి ద్వేషమున్నదో స్పష్టముగా తెలిసికొనవలయుననిన నీ ప్రకరణము నింతటితో సమాప్తము చేసిన చాలదు. ఇకముందు వ్రాయ బోవు పంక్తులను కూడ పాఠకులు గమనింతురుగాక.

శ్రీ శంకరస్వాములు శూద్రులకు శాస్త్రమున నధికారము లేదని సాధించి యంతటితో కసితీఱక కాటోలు పాపము! (శ్రవణాధ్యయనార్థ ప్రతిషేధాత్ 1.3.38.) అను సూత్రమునకు భాష్యము వ్రాసి యందు శూద్రజన్ములకు కొన్ని వరములను కూడ ప్రసాదించియున్నారు. అవి వరములో లేక శాపములో పాఠకులే గుర్తింపగలరు! అట్టివరదాతలయిన యాచార్యుల హృదయ మెంతటి దయార్ద్రమోకూడ పాఠకులూహింతు రుగాక!

(1) 'అథాస్య వేద ముపశృణ్వత స్త్రపుజతుభ్యాం
శ్రోత్రప్రతి పూరణమ్. శాం.భా.'

'వేదమును విను శూద్రుని చెవులు సీసముతోను లక్కతోను నింప వలయును'.

(2) 'భవతి చ వేదోచ్చారణే జిహ్వాచ్ఛేదో ధారణే శరీర
భేదః' శాం.భాష్యము.

'శూద్రుడు వేదము నుచ్చరించిన నతని నాలుక ఛిన్నమగును. ధరించినచో- స్పృశించినచో లేక చదివిధారణ చేసినచో శరీరము భిన్నమగును'.

(3) 'పద్యుహ వా ఏత చ్ఛ్మశానం యచ్ఛూద్రః
తస్మా చ్ఛూద్ర సమీపే నాధ్యేతవ్యమ్'

'శూద్రుడు స్మశానమువలె నపవిత్రుడు. అందువలన నతని సమీప మున వేదము జదువరాదు'.

(4) 'శూద్రాయ మతిం న దద్యాత్'

'శూద్రునకు జ్ఞానము గలిగింపరాదు'.

వేదాంతసూత్రములకు భాష్యమును రచించి యందు శ్రీ శంక

రభగవత్పాదులు శూద్రులకు ప్రసాదించిన మేటి పరమావధి. శూద్రజన్ములనిన శ్రీ శంకరస్వాముల కెంతటి యనుగ్రహమో చూడుడు. కంచెయే చేనుమేసిన కలదె దిక్కు? అని ఆచార్యులే శూద్రజన్ముల కింతటి మహోపకారము చేసియుండ వారి యనుచరులు నేటి బ్రాహ్మణ నామధారులు శూద్రులతో నెట్లు వ్యవహరింపగలరో చదువరు లూహింతురు గాక! సంస్కారజన్ములు, జగద్విఖ్యాత ప్రతిభావంతులు, జగద్ధితార్థమై జన్మించి యావజ్జీవము నఖండ బ్రహ్మచర్యవ్రత నిష్ఠాగరిష్ఠులై వేదవిరుద్ధములను బౌద్ధాది మతముల నపసిద్ధాంతములని నిరూపించిన ధీశాలురు; జగద్గురువులు శంకరాచార్యులు. అట్టివారికి శూద్రజన్ములనిన నింత ద్వేషమేల? ద్వేషములేక యనురాగమేయున్న శూద్రులను జ్ఞానధనమునుండి వంచింప ననువగు సిద్ధాంతముల కుయుక్తులతో సాధింపనేల? శూద్రులు మానవులు కారా? వారు శాస్త్రములను జదివి జ్ఞానులు కానొల్లరా? వారియెడ నెందుల కీయన్యాయము?

వాస్తవమున వేదశాస్త్రములను జదువు నధికార మెవరికున్నది? ఎవరికిలేదు? అను విషయమును నిర్ణయించుటకు వేదములే ప్రమాణములు కాని యన్యములు కావు. ఋషి ప్రణీతములగు స్మృత్యాదులు స్వతః ప్రమాణములైన వేదముల ననుసరించినంత వఱకు ప్రమాణము లగును. కాని వానికి విరుద్ధముగా స్వతంత్రించి యేవిషయమును నిర్ణయింపజాలవు. ఆచార్యులును వేదానుకూల నిర్ణయములు చేసిన నవిపాటింప యోగ్యములగును; విరుద్ధముగ చేసిన నిర్ణయములు జనుల యాదరణమునకు పాత్రములెన్నడును కావు. అందువలన శూద్రులకు వేదములను - శాస్త్రములను - జదువు నధికారము ఉన్నదా? లేదా? యని వేదములనే పరామర్శించుట సమంజసమగును.

వేదములు చదివి చూచినవారికి నందు వేదాధ్యయనము జేయు నధికారమెల్లరకును కలదని కంఠోక్తిగా చెప్పబడుట జూడగలము.

('యథేమాం వాచం కల్యాణీ మావదాని జనేభ్యః బ్రహ్మరాజ న్యాభ్యాం శూద్రాయ చార్యాయ చ స్వాయ చారణాయ చ'. (యజు 26-2)

ఈ మంత్రమున జనులనెల్లర నుద్దేశించి భగవంతుడు వేదవాణిని కల్యాణకరమగు దానిని - యుపదేశించి యున్నట్లు స్పష్టముగా చెప్పబడినది. మంత్రమునందు జనులకని ముందుగా చెప్పి, యటుపై నా జనశబ్దమును వివరించుచు బ్రాహ్మణులు, రాజన్యులు, శూద్రులు, వైశ్యులు, భృత్యులు, ఆర్యులు, అనార్యులు నెల్లరునని స్పష్టపఱపబడినది. మంత్రమునందు బ్రాహ్మణాది శబ్దములతో బాటు శూద్రశబ్దము కూడ స్పష్టముగా సమానముగా గ్రహింపబడుట గమనింపదగిన విషయము. శ్రేయస్కర విధులలో నెల్లయెడల బ్రాహ్మణులతోబాటు శూద్రాదులను గ్రహించి యున్నట్లు వేదమంత్రములలో ననేక స్థలములందు జూడనగును.

ఇట్లు వేదములందు శూద్రులు శాస్త్రమున కధికారులని చెప్పియుండగా బాదరాయణ సూత్రములందు నిరాధారముగ నపశూద్రాధికరణము నొకదానిని కల్పించి, యా శాస్త్రనెపముతో శూద్రుల నధ్యయ నాధ్యాపనాదులనుండి వంచించుటకు శంకరస్వాములవంటి స్వాముల కధికార మెవరొసంగిరి? తమంత తామే యధికారముంగైకొని వేద విరుద్ధ నిర్ణయముల జేసి యెంతకాలము మానవులను వంచింపగలరు? వీరి వ్యాఖ్యానముల నెవరాదరింతురు? వంచనలతో కొందఱను విద్యనుండి దూరమొనర్చి వీరు జగద్గురువు లెట్లగుదురు? ధర్మస్థాపకులైన యాచార్యులే మోసగింప బూనుకొనిన తక్కిన మనుజుల నేమనగలము?

మఱియు ఋగ్వేదము ప్రథమ మండలములోని 116వ సూక్తమునకు ఋషి కక్షీవంతుడు. అతడంగరాజమహిషియొక్క దాసీ పుత్రుడు; అతిశూద్రుడు. ఇట్లే నవమ మండలములోని 76వ సూక్తమునకు కూడ నతడే ఋషి. ఆ కక్షీవంతుని పుత్రుడు శబరుడనువాడు దశమ మండలములోని 169వ సూక్తమునకు ఋషి. కక్షీవంతుని పుత్రిక ఘోషయను నామె దశమ మండలములోని యనేక సూక్తములకు ఋషిక. ఈమెయే గాక అదితి, గోదా, నదీ, యమీ, శశ్వతీ, సరమా, సూర్యా, ఊర్వశీ, అత్రేయీ ప్రభృతు లెందఱో విదుషీమణులు మంత్రద్రష్టలుగా వేదములందు జూడబడుచున్నారు.

ఇంతేగాక, ఇలూషాపుత్రుడు కవషుడు 'అపోనప్త్రియ' మను సూక్త

APASHUDRADHIKARANAM
(SRI SHANKARACHARYULU)



ప్రాప్తి స్థానములు :

1. ఆర్యసమాజము, కూచిపూడి, తెనాలి తాలూకా,
గుంటూరు జిల్లా - 522 313.

2. మాశెట్టి శ్రీనివాస్ ఆర్య, నెం. 5, మాశెట్టి బిల్డింగ్,
3-3-736 నుండి 740, కంచరి బజార్,
సికింద్రాబాద్. ఫోన్ : 6320200

3. వైదిక సాహిత్య భండార్, సుల్తాన్ బజార్, హైదరాబాద్.

ప్రకాశకులు :

అంబా దర్శన గ్రంథమాల
ఆర్యసమాజము, కూచిపూడి,
గుంటూరు జిల్లా - 522 313